క్లుప్తంగా

టీడీపీలో చేరికలు బూటకం

మండపేట: మండలంలోని పాలతోడు గ్రామస్తులు శనివారం నాడు టీడీపీలో చేరడం అనేది ఓ బూటకమని వైఎస్సార్ సీపీ మండపేట మండల కన్వీనర్ పిల్లా వీరబాబు ఆరోపించారు. కొందరు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను సరదాగా మండపేటలోని టీడీపీ కార్యాలయానికి తీసుకు వెళ్లి, వారి మెడలో పసుపు కండువాలు కప్పారన్నారు. మందపల్లి ప్రసాద్, తాతపూడి మోహన్, పైడిమళ్ల ప్రవీణ్, కొమ్ము ప్రవీణ్, మందపల్లి రమేష్, మందపల్లి మోహన్ అనే వారందరూ ఆదివారం వైఎస్సార్ సీపీ మండపేట కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును కలిసి జరిగిన వృత్తాంతమంతా వివరించారన్నారు. ఇలాంటి బూటకపు చేరికలు టీడీపీకే చెల్లిందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట ఆక్షేపించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



స్టేల్‌విల్‌పేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై సురేష్, సీఐ దొరరాజు

రామచంద్రపురం: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ పి.దొరరాజు, ఎస్సై కె.సురేష్ బాబులు పిలుపునిచ్చారు. పట్టణంలోని స్టేల్‌విల్‌పేటలో ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కు వినియోగంపై సీఐ పి.దొరరాజు, కేంద్ర సెక్యూరిటీ బలగాలతో కలసి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ప్రధాన రహదారిలో వీఎస్ఎం కళాశాల నుంచి కేంద్ర బలగాలతో కలసి కవాతు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎస్సై కె. సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని పాత నేరస్తులను, రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని పూచీకత్తుపై విడుదల చేయటం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి జాతర

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలోని నూకాంబిక అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులచే కాగడాలు వెలిగించారు. గరగ నృత్య కళాకారుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అంగర పమర ఖండ్రిక గ్రామాల వీధుల్లో అమ్మవారి జాతర సాగింది. ఆలయం వద్ద మంగళవారం తీర్థం నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

ఆరోగ్య నియమాలు పాటిస్తే అంటువ్యాధులు దూరం

కాజులూరు: ఆరోగ్య నియమాలు సక్రమంగా పాటిస్తే మనిషి అంటు వ్యాధులకు దూరంగా ఉండగలుగుతాడని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి అన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని గొల్లపాలెంలో క్లబ్ సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ వలంటీర్లు గ్రామవీధుల్లో ర్యాలీలు నిర్వహించి మెరుగైన ఆరోగ్యం కోసం ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్లకార్డుల ద్వారా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో వైద్యాధికారి ఎస్.సౌజన్య, పీహెచ్‌సీ సిబ్బంది నరాల రాజారావు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణ పనుల పునః ప్రారంభం

మండపేట: ముస్లింల సంక్షేమానికి నిబద్ధతతో పని చేస్తానని ఇచ్చిన మాటను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నిలబెట్టుకున్నారని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ, షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్ రైతుబజార్ సమీపాన తలపెట్టిన షాదీఖానా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆ పనులను ఆదివారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నాయకులు వెళ్లి పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌ను పిలిపించి గుమ్మాలు, కిటికీల తయారీకి కొలతలు వేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో మున్సిపల్ నిధులు రూ.40 లక్షలు షాదీఖానా భవన నిర్మాణానికి మంజూరైనట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మెండు బాపిరాజు, వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ టౌన్ అధ్యక్షుడు షేక్ గౌస్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్, సాస్త్రా హుస్సేన్, షేక్ అన్సారీ, షేక్ ఉమర్, సయ్యద్ సాలెహా, మేస్త్రీలు వంగా సత్తిబాబు, మెండు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో సప్తాహ జ్ఞానయజ్ఞం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం మద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం కార్యక్రమం వైభవంగా మొదలైంది. పండిత రత్న ఎంటీ ఆళ్లార్ స్వామితో ఆదివారం నుంచి 13వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు భక్త బృందం తెలిపింది. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దుష్టచతుష్టయాన్ని తిప్పికొట్టాలి

- బీసీలను ఓటు రాజకీయాలకు వాడుకున్న చంద్రబాబు
- రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మండపేట బీసీ సదస్సులో నాయకుల ఉద్ఘాటన



మండపేట బీసీ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం/మండపేట: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్ర ప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని, అందులో బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట పట్టణ బస్‌స్టాండ్ సమీపంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం బీసీ సదస్సు నిర్వహించారు. సదస్సుకు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, పిల్లి సుభాష్ చంద్రబోసు, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తదితరులు హాజరయ్యారు. బీసీ సామాజిక వర్గ నాయకులను, సామాజిక వృత్తి సంఘాల నాయకులను ఎమ్మెల్సీ తోట సదస్సుకు పరిచయం చేశారు. తొలుత జ్యోతీరావ్‌పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఓపెన్ టాప్ వాహనంపై పట్టణ వీధుల్లో ఊరేగింపుగా సభా వేదిక వద్దకు వచ్చారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోసు, ఎంపీ మార్గాని భరత్‌రామ్‌లకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు.

కిక్కిరిసిన సదస్సు ప్రాంగణం

మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా మండపేట బీసీ సదస్సు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సు ప్రాంగణం బీసీ వృత్తిదారులు, బీసీ సంఘాల కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. మండపేట పట్టణం, మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురంలోని 19 గ్రామాలు, రాయవరం మండలంలోని 12 గ్రామాల నుంచి అశేష సంఖ్యలో బీసీ సామాజిక వర్గీయులు సదస్సుకు హాజరయ్యారు. ఆయా గ్రామాల నుంచి సొంత వాహనాలను ఏర్పాటు చేసుకుని వారంతా తరలి వచ్చారు.

ఆకట్టుకున్న నాయకుల ప్రసంగాలు

సదస్సులో బీసీ సంఘాల నాయకులు, వృత్తిసంఘాల నాయకులు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబు దీర్ఘకాలం పాటు బీసీలను తన గొడుగు కింద ఉంచుకుని ఓట్ల రాజకీయం చేశారని, సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే బీసీలకు అన్ని విధాలా ప్రగతిబాట వేశారన్నారు. చేనేత కార్మిక కుటుంబాలకు నేతన్న నేస్తం, మత్స్యకారులకు మత్స్యకార భరోసా వంటి పథకాలను అమలు చేయడంతో పాటు సాధారణ మహిళలందరికీ ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలను ఏమాత్రం నమ్మవద్దని రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులును, ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాద్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడం ద్వారా చంద్రబాబు దుష్ట పన్నాగాలకు పాతర వేయాలని నాయకులు కోరారు. మండపేటలో బీసీలను రాజకీయ పావులుగా వాడుకుంటూ పెత్తందారీ రాజకీయాలు సాగించే ప్రతిపక్ష నేతలకు రానున్న ఎన్నికల్లో బీసీలంతా తమ ఓటుతో చెక్ పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, నాయకులు తోట పృథ్వీరాజ్, జెడ్పీటీసీ సభ్యులు కురుపూడి భవాని, పుట్టపూడి అబ్బు, ఎంపీపీలు ఉండమట్ల శ్రీనివాస్, మేడిశెట్టి సత్యవేణి, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, పార్టీ మండపేట పట్టణశాఖ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, రూరల్ అధ్యక్షుడు పిల్లా వీరబాబు, కపిలేశ్వరపురం మండల కన్వీనర్ శీలం గోవింద్, రాయవరం మండలానికి చెందిన సిరిపురపు శ్రీనివాసరావు, కోట వెంకట్రావు, వాసంశెట్టి వెంకట్రావు, పాలిక గోవింద్, పిల్లి ప్రసాద్, గుత్తుల సత్యనారాయణ, బీసీ అనుబంధ విభాగాల నామినేటెడ్ నాయకులు, కల్లుగీత, చేనేత తదితర బీసీ ఉపకులాల వృత్తిదారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు కంప్యూటరు, సామగ్రి బహూకరిస్తున్న ఇండూస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు

కాజులూరు: వ్యవస్థలో రోజురోజుకీ పురోగతి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని దుగ్గుదుర్రు మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుబ్బల అప్పారావు అన్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన ఇండూస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ దుగ్గుదుర్రుకు చెందిన సంస్థ ప్రతినిధి జి.రాజేష్ ద్వారా రూ.75 వేలు విలువ చేసే కంప్యూటర్లు, సామగ్రి పాఠశాల విద్యార్థులకు బహూకరించింది. హెచ్‌ఎం గుబ్బల అప్పారావు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి వ్యవస్థలోనూ కంప్యూటర్ వినియోగం అవసరమవుతుందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత విద్యలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కంప్యూటర్లు, సామగ్రి బహూకరించిన సంస్థ ప్రతినిధులకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఇళకల లోవరాజు, ఉపేంద్ర, శ్రీనివాసరాజు, సుజాత, ఆనంద్, నాగేశ్వరరావు, పల్లంరాజు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్

- రామచంద్రపురం వాసులతో నిజాంపేట్‌లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఆత్మీయ సమ్మేళనం
- పాల్గొన్న రాపాక, పిల్లి సుభాష్ చంద్రబోస్ తదితరులు



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వరప్రసాద్, సూర్యప్రకాష్‌లను పూలమాలలతో సత్కరించిన అభిమానులు

రామచంద్రపురం: పజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. హైదరాబాద్‌లోని నిజాంపేట్ సప్తపది ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి రామచంద్రపురం ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు రూ.2.61 లక్షల కోట్ల నిధులను వెచ్చించారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఆయనకిచ్చిన 642 హామీల్లో కేవలం 40 మాత్రమే అమలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజలను ఎలాగైనా మోసం చేయాలని చంద్రబాబు అనేక ప్రయత్నాలు చేస్తారని వాటిపై మనమంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హామీలన్నీ నెరవేర్చిన జగన్ నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఉంది. ప్రతి పేద కుటుంబం బాగుండాలంటే, ప్రతి విద్యార్థి, రైతు, యువకుడు బాగుండాలంటే జగన్‌ని మరోసారి సీఎం చేయాలని పిలుపునిచ్చారు. అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అవకాశాలు, సంక్షేమ పథకాలు సక్రమంగా జరగాలంటే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని పిలుపునిచ్చారు. పేద వర్గాలకు న్యాయం చేసే నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రజలకు అనునిత్యం పనిచేసే తనను అదే విధంగా రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్‌ను ఆశీర్వదించాలని కోరారు. రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దే పార్టీ వైఎస్సార్ సీపీకే అందరూ ఓటు వేయాలని కోరారు. ప్రజాస్వామ్యన్ని రక్షించుకునేందుకు మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసిన ప్రతి పక్షాలు జెండాలు జతకట్టి కుట్రలు చేస్తున్నాయన్నారు. ఇలాంటి కుట్రల పట్ల మనందరం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు ఎక్కడ ఉన్న అందరికీ తానెప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాస రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఎమెల్సీ తోట విజయానికి కృషి చేస్తా

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం టౌన్ ప్రెసిడెంట్ అర్జున్

మండపేట: వైఎస్సార్‌సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు విజయానికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆ పార్టీ టౌన్ ప్రెసిడెంట్, ఎమ్మార్పీఎస్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉండ్రాజవరపు అర్జున్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తోట త్రిమూర్తులు మండపేట నియోజకవర్గానికి వచ్చాక ఇక్కడి ప్రజా సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. కులమతం భేదాలు లేకుండా అన్నివర్గాల వారినీ సమాన దృష్టితో చూస్తున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని దళితుల చిరకాల కోరికైన బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ల విగ్రహాలను పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అటువంటి తోట త్రిమూర్తులును వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడిగా తాను నియోజకవర్గం అంతటా పర్యటించి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఓట్లు ఫ్యాను గుర్తుకు పడేలా చైతన్య పరుస్తానన్నారు.

అందరూ భగవద్గీతను అనుసరించాలి

ఇస్కాన్ మందిర భక్తుడు రాధా మనోహరదాసు



గీతా మందిరంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న రాధా మనోహరదాసు

రాయవరం: భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు సూచించిన విధంగా ప్రతి ఒక్కరూ నడుచు కోవాలని తిరుపతికి చెందిన ఇస్కాన్ మందిర భక్తుడు రాధా మనోహరదాసు పిలుపునిచ్చారు. మండలంలోని వెదురుపాక గీతా మందిరంలో నిర్వహిస్తున్న భగవద్గీత పాఠశాలను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రాధా మనోహరదాసు ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ.. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవడం ద్వారా జీవితాన్ని తరింప జేసుకోవాలన్నారు. ప్రతి ఇంటిలోనూ భగవద్గీత ఉండాలని, ప్రతి ఒక్కరూ గీతను చదివి భావాన్ని అర్థం చేసుకొని జీవితానికి అన్వయించుకోవాలన్నారు. గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భగవద్గీత పాఠశాలను నిర్వహిస్తున్న తీరు పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక భగవద్గీత పాఠశాలలో గ్రామానికి చెందిన చిన్నారులు, పెద్దలతో పాటుగా పరిసర గ్రామాల చిన్నారులు, పెద్దలకు భగవద్గీత నేర్పిస్తున్న తీరును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా గీతామందిరం తరపున మనోహర్ దాస్‌ను గీతా మందిరం నిర్వాహకులు సత్తి రామకృష్ణారెడ్డి, సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేద పండితులు కొత్తూరి సాయి శంకర శర్మ, శ్రీకృష్ణ భక్తులు చింతా సుబ్బారెడ్డి, పడాల శివమణికంఠ రెడ్డి, గీతా మందిర నిర్వాహక కమిటీ సభ్యులు, పరిసర గ్రామాలకు చెందిన కృష్ణ భక్తులు పాల్గొన్నారు.

మంచు దుప్పట్లో మండపేట



తాటి చెట్ల వెనుకగా, మంచు పరదాల్లో నుంచి తొంగి చూస్తున్న ఉదయభానుడు

మండపేట: ఆదివారం ఉదయాన్నే మండపేట పట్టణాన్ని మంచు దుప్పటి కప్పేసింది. తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన మంచు ఉదయం 7 :30 గంటలైనా తగ్గలేదు. సూరీడు చెట్ల వెనుక, మంచు పరదాల్లో చిక్కుకున్న సూర్యుడు బయటకు రానా? వద్దా? అని తొంగి.. తొంగి చూస్తున్న దృశాలు చూపరులను కట్టి పడేశాయి. మెయిన్ రోడ్డు, బైపాస్ రోడ్డు, ఏడిద రోడ్డుతో పాటు గొల్లపుంత కాలనీ రోడ్లను కూడా మంచు పూర్తిగా కమ్మేసింది. పొగమంచు ప్రభావం ప్రయాణికులపై పడింది. వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. కాలనీకి నుంచి పట్టణంలోకి రాకపోకలు సాగించే వారు సైతం ద్విచక్ర వాహనాలకు లైట్లు వేసుకున్నారు. ఉదయం మార్నింగ్ వాక్ చేసే సీనియర్ సిటిజన్స్, జాగింగ్ చేసే యూత్ మంచుతో కూడిన ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ముందుకు సాగారు. అయితే ఉదయం 10 గంటలయ్యే సరికి ఎండ తీవ్రత అధికమైంది.

అవయవ దాత కుటుంబానికి అండగా ఉంటాం

మండపేట: బ్రెయిన్ డెడ్ అయ్యాక తన అవయవాలను దాన మిచ్చి పలువురి ప్రాణాలు నిలిపిన కాద రాజు తన కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని శాసనమండలి సభ్యుడు తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని మారేడుబాక ఫైర్ స్టేషన్ సమీపంలో నివశిస్తున్న కాద రాజు కుటుంబాన్ని శెట్టిబలిజ సంఘ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ తోట ఆదివారం పరామర్శించారు. రాజు చిత్ర పటం వద్ద పూలు చల్లి నివాళులు అర్పించారు. మృతుడి ఇద్దరు పిల్లలను ఎమ్మెల్సీ దగ్గరకు తీసుకుని ఓదార్చారు. చిన్న వయసులోనే రాజు చనిపోవడం వల్ల ఆ కుటుంబానికి కలిగిన నష్టాన్ని ఎవరూ భర్తీ చేయలేరన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ తరపున తాము అండగా వుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో మండపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, ఆ పార్టీ నాయకులు సూరంపూడి సత్యప్రసాద్, యాండ్ర ప్రభాకరరావు (బుజ్జి), టేకి దుర్గారావు, కొండపల్లి రాజేంద్రప్రసాద్, చొల్లంగి గోవిందు, మొల్లేటి వీరవెంకటరమణ, వాసంశెట్టి కామేశ్వరరావు, వల్లు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.


వెదురుపాకలో ఇఫ్తార్ విందు



వెదురుపాకలో ఇఫ్తార్ విందు

రాయవరం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని వెదురుపాక మసీదులో మసీదు నిర్వాహకుడు షేక్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. మసీదు ఇమామ్ అఫీజ్ మహమ్మద్ అబూ బక్కర్ అబీబీ ఖురాన్ పఠించి, రంజాన్ మాస విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఇమామ్ అఫీజ్ మాట్లాడుతూ దివ్య ఖురాన్ ఆవిర్భవించిన మాసం రంజాన్ మాసంగా పేర్కొన్నారు. రంజాన్ మాసంలో కఠిన (రోజా) ఉపవాస దీక్షలు, దానధర్మాలు ,ఆధ్యాత్మిక సందేశాలతో కూడి ఉంటుందన్నారు. ఉపవాస దీక్షను విరమించిన అనంతరం గ్రామానికి చెందిన ముస్లింలతో పాటు, వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు, గ్రామానికి చెందిన పలువురు హిందువులు కలిసి ఇఫ్తార్ విందు ఆరగించారు. ఈ సందర్భంగా మసీదు నిర్వాహకుడు అహ్మద్ బాషా ఇఫ్తార్ విందులో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు షేక్ ఖాజా బాబు,షేక్ మహబూబ్ బాషా, సయ్యద్ బాషా, షేక్ సలీం, షేక్ వలీ, గ్రామానికి చెందిన పలువురు పెద్దలు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



రామచంద్రపురం రూరల్: ఇప్పటికే భానుడి భగభగలు ప్రారంభమయ్యాయి. ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. వాతావరణ శాఖ ప్రత్యేక హెచ్చరికలు జారీ చేసింది. మండే ఎండలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరని వైద్యులు సూచిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రజలను అప్రమత్తం చేసేందుకు అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేస్తోంది.

వడదెబ్బతో జాగ్రత్త..

వేసవిలో ప్రజలు త్వరితగతిన వడదెబ్బకు గురవుతారు. చర్మం పొడిబారడం, చమటలు పట్టకపోవడం, తడి ఆరకపోవడం, నాడి అధికంగా కొట్టుకోవడం, స్పృహ కోల్పోవడం, శరీర ఉష్ణోగ్రత అమాంతం పెరిగిపోవడం తదితర లక్షణాలు వడదెబ్బ తగిలిన వారిలో కన్పిస్తాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, తదితర జబ్బులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లటి వాతావరణంలోకి తీసుకెళ్లాలి. చల్లటి తడినీటి గుడ్డతో తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు చల్లటి ప్రదేశాల్లో ఉంచాలి. వ్యక్తి పరిస్థితి తీవ్రమైతే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలి. ఓఆర్ఎస్, గ్లూకోజ్, కొబ్బరి నీళ్లు, అందించాలి. మండు వేసవిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు బయట తిరగకూడదు. ఒకవేళ వెళ్లినా తలపై టోపీ లేదా గొడుగు తప్పకుండా ఉపయోగించాలి. ముఖ్యంగా వద్దులు, చిన్న పిల్లలు ఎండలో తిరగకపోవడం మంచిది. రోజూ 4 లీటర్ల నుంచి 5 లీటర్ల మంచి నీరు తప్పనిసరిగా తాగాలి.

వైద్యుల సూచనలు పాటించాలి



గతంలో కంటే ఎండ తాపం అధికంగా ఉంది. జీవన, ఆహార శైలిలో మార్పులు తప్పక చేసుకోవాలి. సురక్షిత ప్రమాణాలు పాటించాలి. వడదెబ్బ తగిలినప్పుడు దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తక్షణ వైద్యం తీసుకోవాలి. సాధారణ జ్వరం వచ్చినప్పుడు అందించే మందులు వాడొద్దు. వైద్యుల సూచనలతో ఐవీ ఫ్లూయిడ్స్, వైద్య సాయం తీసుకోవాలి.

– ఎస్.ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, రామచంద్రపురం

ఆరోగ్యం అంటే అన్నం తినడం మాత్రమే కాదు



అంగర పీహెచ్‌సీ నుంచి ర్యాలీగా వెళ్తున్న వైద్యాధికారి రత్నకుమారి, సిబ్బంది



మండపేట పార్కులో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం 'నా ఆరోగ్యం –నా హక్కు' అనే నినాదంతో ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్నట్టు అంగర పీహెచ్‌సీ అధికారి పి.రత్నకుమారి తెలిపారు. ఈ పీహెచ్‌సీ వద్ద నుంచి ఆదివారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృష్టిలో అత్యంత విలువైనది ఆరోగ్యమని, దానిని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఆరోగ్యమనగానే అన్నం తినడం మాత్రమే కాదని, పోషక విలువలున్న అనుబంధ ఆహార పదార్థాలను విధిగా తీసుకోవాలన్నారు. ఫాస్ట్ ఫుడ్ సంస్కృతికి దూరంగా ఉండాలని, మితాహార పద్ధతిలో ప్రకృతి సిద్ధమైన పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జె.మల్లికార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధర్యంలో..

మండపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బురుగుంట చెరువు వైఎస్సార్ పార్కులో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ సారథ్యంలో టోరంట్ కంపెనీ వారిచే పార్కులో వాకింగ్ చేసే 82 మందికి ఉచితంగా బీఎండీ మెడికల్ టెస్టులు చేసి, కీళ్లనొప్పుల శాతాన్ని తెలుసుకున్నారు. డాక్టర్ బిక్కిన తాతబ్బాయి (బీటీ చౌదరి) ఆరోగ్య సూత్రాలు వివరించారు. ఆహారపు అలవాట్ల వల్ల కొందరికి కీళ్లనొప్పులు వస్తున్నాయని, బలవర్ధక ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రెడ్డి రవిరాజు, తాతపూడి సుధీర్, గంపల సత్యప్రసాద్, తిరుశూల వెంకట్రావు, లంక సత్తిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, మేకా సాయి పాల్గొన్నారు.